సాక్షి సిద్దిపేట

శుక్రవారం । 31 । మార్చి । 2023



ఇర్కోడ్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు
2021-22 సంవత్సరానికిగాను ఇర్కోడ్ గ్రామాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మరోసారి పురస్కారంతో సత్కరించనుంది. 8లో..



వినూత్న ఆలోచన.. పంటకు రక్షణ
రైతు గుగులోతు రాజు నాయక్ పంటపై పక్షులు దాడి చేయకుండా వినూత్న ఆలోచన చేశాడు. తన వాయిస్ రికార్డు చేయించి ప్రతీరోజు పొలం వద్ద మైక్ పెడుతున్నాడు. ఈ శబ్దంతో పక్షులు రావడం లేదు. 8లో..



తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే
తెలంగాణలో అధికారంలోకి రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. 9లో..



టెన్త్.. 253 స్టూడెంట్స్

ఇందిరానగర్ జెడ్పీహెచ్ఎస్ నుంచి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య



ఇందిరానగర్ పాఠశాల నుంచి పదోతరగతి పరీక్ష రాసే విద్యార్థులు వీరే

- గతేడాది 238 మంది.. 100శాతం ఉత్తీర్ణత
- మంత్రి హరీశ్‌రావు చొరవతో సర్కారు బడిలో కార్పొరేట్‌స్థాయి విద్య

సాక్షి, సిద్దిపేట: ఆ స్కూల్ నుంచి ఈ ఏడాది పదోతరగతి వార్షిక పరీక్షలకు 253 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. అదేదో కార్పొరేట్ స్కూల్ అనుకుంటున్నారా కానే కాదు. అది సిద్దిపేట జిల్లాకేంద్రంలోని ఇందిరానగర్ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల. ఈ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 1,232 మంది విద్యార్థులు చదువుతున్నారు. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో ఈ పాఠశాలలో సకల సౌకర్యాలు కల్పించడంతోపాటు కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తున్నారు.

ఇది 32వ బ్యాచ్

ఇందిరానగర్ పాఠశాల 1982 సంవత్సరంలో ప్రారంభించారు. అప్‌గ్రేడ్ అవుతూ 1991 నాటికి ఉన్నత పాఠశాలగా మారింది. ఆ ఏడాది తొలిసారిగా పదోతరగతి విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 2022–2023 సంవత్సరంలో 253 మంది విద్యార్థులు టెన్త్ ఎగ్జామ్ రాస్తుండగా, వారిలో బాలురు 131, బాలికలు 122 మంది ఉన్నారు. గతేడాది 238 మంది పరీక్షలు రాయగా 100శాతం ఉత్తీర్ణత సాధించారు. అదే జోష్‌తో ఈఏడు సైతం 100శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. వారికి కేసీఆర్ డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్ మంత్రి హరీశ్‌రావు అందించారు. సిద్దిపేట జిల్లాలో అయితే 253 మంది విద్యార్థులు ఒకే ప్రభుత్వ పాఠశాల నుంచి పదో తరగతి పరీక్షలు రాయటం ఇదే మొదటిసారి అని జిల్లా విద్యాశాఖ అధికారులు అంటున్నారు.

అడ్మిషన్లు దొరకడమే కష్టం

కార్పొరేట్ స్థాయి విద్యను ప్రభుత్వ పాఠశాలలో అందిస్తుండటంతో ఆ పాఠశాలలో అడ్మిషన్ దొరకడమే కష్టంగా ఉంటుంది. ప్రతీ సంవత్సరం అడ్మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరించి విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నారు. డిజిటల్ (స్మార్ట్) క్లాస్‌రూం, కంప్యూటర్ ఇంటిగ్రేటెడ్ ల్యాబ్, లైబ్రరీ, ఆడిటోరియం, సోలార్ ప్లాంట్, యోగా తరగతులు, ఇంగ్లిష్ మాట్లాడే విధంగా ప్రత్యేక శిక్షణ, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ, ఎస్ఎమ్‌సీ కమిటీ సమావేశాలు, రోబోటిక్స్, ప్రపంచ పరిజ్ఞానం విద్యార్థులకు తెలిసేవిధంగా చేయడం, సాంస్కృతిక, క్రీడలు ఏర్పాటు చేస్తుంటారు. దీంతో విద్యార్థుల తల్లితండ్రులు ఈ పాఠశాలలలో చేర్పించేందుకు ఎక్కువగా మక్కువ చూపుతున్నారు.

అందరి సహకారంతో ముందుకు



విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో ముందుకు వెళ్తున్నాం. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతోనే మా పాఠశాలకు విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఈ సారి కూడా పదో తరగతిలో 100శాతం ఉత్తీర్ణత మా విద్యార్థులు సాధిస్తారని నమ్మకం ఉంది. ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్‌స్థాయి విద్య మా విద్యార్థులకు అందిస్తున్నాం.

–సత్యనారాయణరెడ్డి, ఇన్‌చార్జ్ హెచ్ఎం



కల్యాణశోభలో శ్రీ సీతారాములు



గణేష్‌నగర్ ప్రసన్నాంజనేయస్వామికి వెండిగదను అందిస్తున్న మంత్రి హరీశ్‌రావు

కల్యాణ వైభోగమే...

- వాడవాడలా రాములోరి ఉత్సవాలు
- హాజరైన మంత్రి హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శ్రీరామనవమి ఉత్సవాలు జిల్లావ్యాప్తంగా ప్రజలు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. గురువారం పలు ఆలయాల్లో శ్రీ సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది. సిద్దిపేట పట్టణమంతా శ్రీరామనామంతో మార్మోగింది. జిల్లా కేంద్రంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాల్లో మంత్రి తన్నీరు హరీశ్‌రావు పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నంలోపు పట్టణంలోని 22 ఆలయాలల్లో శ్రీ సీతారాముల కల్యాణ ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. పట్టణంలోని గణేష్‌నగర్ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి వెండి గద, ఇతర అలంకరణ వస్తువులు అందించారు. శ్రీనగర్ కాలనీ, హౌసింగ్‌బోర్డు కాలనీ, హరిప్రియనగర్, శివాజీనగర్, హనుమాన్‌నగర్, శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయం, గాంధీనగర్, శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయం, వడ్డెర కాలనీ, సంతోష్‌నగర్, సుభాష్‌నగర్, కళ్లకుంట కాలనీ, ససీతారాంనగర్, బాలంజనేయస్వామి, అభయాంజనేయ స్వామి, ఖాదర్‌పూర, నాసర్‌పూర, నర్సాపూర్, పాతగంజి, శ్రీ రేణుకనగర్, మహాశక్తినగర్, శ్రీనివాసనగర్, తదితర కాలనీలలోని ఆలయాలలో నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణ ఉత్సవాల్లో మంత్రి హరీశ్‌రావు పాల్గొని, పట్టు వస్త్రాలు అందించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



శ్రీ సీతారామచంద్ర ఆలయంలో కల్యాణం తిలకిస్తున్న భక్తులు

న్యూస్‌రీల్

దళితులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు



మాట్లాడుతున్న తాళ్లపల్లి లక్ష్మణ్

హుస్నాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులను విస్మరిస్తున్నాయని దళిత హక్కుల పోరాటసమితి రాష్ట్రనాయకుడు తాళ్లపల్లి లక్ష్మణ్ అన్నారు. పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డి అమరులభవన్‌లో గురువారం దళిత హక్కుల పోరాట జిల్లా రెండవ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ దళితులు ఇప్పటికీ కులవివక్ష ఎదుర్కొంటున్నారన్నారు. సామాజికంగా, న్యాయపరంగా వారిని రక్షించడంలో పాలక ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా కార్యదర్శి వేల్పుల బాలమల్లు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు జాగిరి సత్యనారాయణ, కనుకుంట్ల శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు భాస్కర్, కొమురయ్య, జనార్దన్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు అంబేద్కర్ విగ్రహావిష్కరణ



విగ్రహ ఆవిష్కరణ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

దుబ్బాక: రాయపోల్ మండలపరిధిలోని బేగంపేటలో శుక్రవారం నిర్వహించే అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు అన్నారు. విగ్రహావిష్కరణ కరపత్రాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రజాయుద్ధనౌక గద్దర్ హాజరవుతున్నారన్నారు. అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు ప్రకాష్, యూత్ సభ్యులు స్వామి, ప్రశాంత్, భూపాల్, బాలకృష్ణ, సందీప్, సంతోష్, రాజు, తదితరులున్నారు.

ఆదరణ లేకనే సమ్మేళనాలు



మాట్లాడుతున్న యాదగిరి

నంగునూరు(సిద్దిపేట): బీఆర్‌ఎస్‌కు ప్రజల్లో ఆదరణ తగ్గడంతో ఆత్మీయ సమ్మేళనం పేరిట వారికి దగ్గరయ్యేందుకు అష్టకష్టాలు పడుతున్నారని టీపీసీసీ సంయుక్త కార్యదర్శి దేవులపల్లి యాదగిరి అన్నారు. గురువారం నంగునూరులో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మంత్రి హరీశ్‌రావు ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో లంచాలతో పనులయ్యాయని చెప్పిన హరీశ్‌రావు అప్పటి ప్రభుత్వంలో మంత్రిగా ఎందుకు పని చేశారో చెప్పాలన్నారు. సమావేశంలో ఎంపీటీసీ నితిన్ కుమార్, చెలికాని యాదగిరి, శ్రీకాంత్‌యాదవ్, నాగరాజు, కృష్ణ, కిషన్, శ్రీనివాస్, సంజీవ్, తిరుపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ కమిషనర్ పరామర్శ

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్ర విద్యాశాఖ స్టేట్ ప్రాజెక్టు అడిషనల్ డైరెక్టర్ గాజర్ల రమేష్‌ను రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ దేవసేన పరామర్శించారు. మండల పరిధిలోని గుండారంలో గాజర్ల రమేష్ తండ్రి గాజర్ల బాలయ్య గురువారం గుండెపోటుతో మరణించారు. రమేష్‌ను పరామర్శించినవారిలో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ పావని తదితరులు ఉన్నారు.



ఆకులతో తయారు చేసిన గిన్నెల్లో ప్రసాదం పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత

శుభకార్యాల్లో స్టీల్ వస్తువులే వాడండి

హుస్నాబాద్: మీ ఇంట్లో జరిగే శుభకార్యాల్లో ప్లాస్టిక్ వస్తువులు బదులు స్టీల్ వస్తువులను వాడాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని రామాలయంలో గురువారం జీరో వేస్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రజిత మాట్లాడుతూ ప్రజలందరూ ఇప్పటి నుంచే తమఇంట్లో జరిగే శుభాకార్యాల్లో స్టీల్ వస్తువులు లేదా భూమిలో కుళ్లిపోయే స్వభావం ఉన్న వస్తువులను వాడి రాబోయే తరాలకు మార్గదర్శకులు కావాలన్నారు. అనంతరం పట్టణంలోని రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలకు వచ్చిన భక్తులకు ఎండిపోయిన ఆకులతో తయారు చేసిన గిన్నెల్లో ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, కౌన్సిలర్లు బోజు రమాదేవి, కోమటి స్వర్ణలత, పెరుక భాగ్యరెడ్డి, పున్నలావణ్య, చిత్తారి పద్మ, గోవిందు రవి, దొడ్డి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వేతన వెతలు

మూడు నెలలుగా మల్టీపర్పస్ కార్మికుల ఎదురుచూపులు

సిద్దిపేటఅర్బన్: గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదు. దీంతో వారు అప్పు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో వీధులు శుభ్రపరచడం, మురికి కాలువలు తీయడం, డ్రైవర్, ఎలక్ట్రీషియన్, నర్సరీలో మొక్కలు పెంచడం, గ్రామంలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు చేరవేయటం, చెత్తను సెగ్రిగేట్ చేయడం వంటి పనులను మల్టీ పర్పస్ కార్మికులు చేస్తున్నారు. జీతం కింద ఒకొక్కరికి నెలకు రూ.8500 చెల్లిస్తున్నారు. అది కూడా సక్రమంగా రావడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 2500 వేల మంది కార్మికులు

జిల్లాలోని 399 గ్రామ పంచాయతీల పరిధిలో 2500 మంది కార్మికులు రోజు వారీగా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో కొంత మందికి 2, 3 నెలల బకాయిలు ఉండగా, మరి కొంతమందికి నాలుగు, ఐదు నెలలుగా జీతాలు బకాయి ఉన్నాయి. మొత్తంగా వారికి రూ.1.5 కోట్లు చెల్లించాల్సి ఉంది. గ్రామ పంచాయతీ కార్మికులు ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టం చేస్తే వారికి చెల్లించే జీతాలు అరకొరగా ఉండడంతో కుటుంబాన్ని ఎలా నెట్టుకురావాలో తెలియక సతమతమవుతున్నారు.

కనీస సౌకర్యాలు కరువు

జిల్లాలో కార్మికులకు కనీస సౌకర్యాలు కూడా లేవు. ఇతర జిల్లాలో కార్మికులకు సంవత్సరానికి రెండు పర్యాయాలు రెండు జతల యూనిఫామ్స్, మాస్కులు, సబ్బులు, నూనె తదితర వస్తువులు అందిస్తుంటే, అందుకు భిన్నంగా జిల్లాలో పరిస్థితి ఉందని కార్మికులు ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల వేధింపులు ఎక్కువయ్యాయని, ప్రశ్నిస్తే పనిలో నుంచి తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస సౌకర్యాలు కల్పించాలని కలెక్టరేట్ వద్ద ఎన్నిసార్లు ధర్నా చేసినా పట్టించుకోలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని కార్మికులు హెచ్చరిస్తున్నారు.



మురికికాల్వను శుభ్రం చేస్తున్న కార్మికులు

మూడు నెలల జీతం రావాలి



నాకు ఐదు నెలల జీతం పెండింగ్‌లో ఉండగా, నవంబర్, డిసెంబర్ నెలకు సంబంధించిన జీతం అకౌంట్‌లో వేశారు. ఇంకా మూడు నెలల జీతం పెండింగ్‌లో ఉంది. శానిటేషన్ మంచిగా ఉండాలి..ట్యాక్స్ కలెక్షన్లు సరిగ్గా చేయాలని టార్గెట్ పెడతారు కానీ కార్మికుల సమస్యలు పట్టించుకోవడం లేదు.

–కొత్తపల్లి యాదయ్య, ఎన్సాన్‌పల్లికారోబార్

కనీస సౌకర్యాలు కల్పించాలి



పంచాయతీ కార్మికులకు కనీస సౌకర్యాలు లేవు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో పోరాడి సాధించుకున్న జీఓలు స్వరాష్ట్రంలో అమలు చేయడం లేదు. బకాయి వేతనాల కోసం ఈ మధ్యే ఒక రోజు నిరసన తెలిపాం. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన బాట పడతాం.

–తునికి మహేష్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

పీఎంఎఫ్ఎస్‌కు మార్పు వల్లే జాప్యం



కార్మికులు జీతం డబ్బులు పడే అకౌంట్లు ఐఎంఎఫ్ నుంచి పీఎంఎఫ్ఎస్‌కు మారుతున్నందు వల్లే ఆలస్యం అయ్యాయి. గత నెల వరకు సంబంధించిన జీతాలు చాలా వరకు చెల్లింపు చేశాం. ఇంకా ఎవరికైనా ఇతర కారణాల వల్ల జీతం పడని వారు నా దృష్టికి తీసుకొస్తే సమస్య పరిష్కరించి జీతాలు చెల్లిస్తాం.

– దేవకీదేవి, డీపీఓ

ఎన్ఎస్ఎస్‌తో సేవాభావం పెంపు

కొండపాక(గజ్వేల్): విద్యార్థుల్లో సేవాభావం పెంపొందించేందుకు ఎన్ఎస్ఎస్ శిబిరం దోహదపడుతుందని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మర్పడ్గలోని విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రం ఆవరణలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ 4,7 యూనిట్ల ప్రత్యేక శిబిరాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ సేవాభావం వల్ల మనసు, మనిషికి లభించే తృప్తి, గౌరవం ఎనలేనిదన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవా దృక్పథాలు అలవర్చేలా ఎన్ఎస్ఎస్ శిబిరం ఉపయోగపడుతుందన్నారు. సామాజిక సేవ నిత్య జీవితంలో భాగం కావాలని కోరారు. అనంతరం క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈకార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు పల్లవి, రాణి, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఎస్ఎస్ శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

జాప్యమెందుకో..?

- కొమురవెల్లి ఆలయ పనుల్లో వసూళ్ల దందాపై చైర్మన్ ఫిర్యాదు
- విచారణకు ఆదేశించిన అడిషనల్ కమిషనర్
- నెలన్నర అవుతున్నా చర్యలు తీసుకోని వైనం

సాక్షి, సిద్దిపేట: కొమురవెల్లి మల్లన్న ఆలయ పనుల్లో వసూళ్ల దందా సాగుతోంది. ఆలయ పరిధిలో అభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో కాంట్రాక్టర్ల నుంచి దేవాలయ ద్వితీయ కీలక ఉద్యోగి అక్రమంగా డబ్బు వసూలు చేశాడంటూ దేవాదాయ కమిషనర్‌కు ఆలయకమిటీ చైర్మన్ గీస భిక్షపతి ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేయాలని ఈఓ బాలాజీని అడిషనల్ కమిషనర్ జ్యోతి ఆదేశించారు. అయినా విచారణలో జాప్యం జరుగుతుండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వసూళ్లకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఏజెంట్

జాతర సమయంలో చేయాల్సిన వివిధ అభివృద్ధి పనులు కాంట్రాక్టర్లకు అప్పగించారు. కాంట్రాక్టర్ల నుంచి డబ్బు వసూళ్ల కోసం ఔట్ సోర్సింగ్‌కు చెందిన ఓ వ్యక్తిని దేవాలయ ద్వితీయ కీలక ఉద్యోగి ఏజెంట్‌గా నియమించుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. ఆ కాంట్రాక్టర్ల నుంచి ఫోన్‌పే, గూగుల్‌పేల ద్వారా ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఫోన్ నంబర్‌కు అమౌంట్ ట్రాన్స్‌ఫర్ అయ్యింది. దాదాపు ఇలా రెండు లక్షల రూపాయల వరకూ వసూలు చేశాడు. ఆపై ఔట్ సోర్సింగ్‌లో పనిచేసే వ్యక్తి ఆ డబ్బు డ్రాచేసి సదరు ఉద్యోగికి ఇచ్చినట్టు ఆలయ చైర్మన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆలస్యమెందుకో...

వసూళ్ల దందాపై ఆలయ చైర్మన్ గత జనవరి 18న ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించి ఫిబ్రవరి 10న విచారణ రిపోర్టు అందించి, చర్యలు తీసుకోవాలని ఈఓ బాలాజీని అడిషనల్ కమిషనర్ జ్యోతి ఆదేశించారు. విచారణకు ఆదేశించి దాదాపు నెలన్నర అవుతున్నా ఎవరిపై ఏ చర్యలూ తీసుకోలేదు. ఆలస్యానికి కారణాలేమిటో అర్థం కావడం లేదు.

నోటీసులు జారీ చేశా

అక్రమ వసూళ్ల పై వచ్చిన ఫిర్యాదుతో ఏఈఓకు నోటీసులు జారీ చేశామని ఈఓ బాలాజీ చెప్పారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగిపై కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



కొమురవెల్లి దేవాలయ గోపురం

క్లుప్తంగా

మరణంలోనూ ప్రాణదాతగా..


భరత్ (ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన ఫొటోగ్రాఫర్ భరత్ ముదిరాజ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా మృతుడు భరత్ అవయవాలను వారి కుటుంబ సభ్యులు దానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భరత్ సోదరి అనిత కిడ్నీ సమస్యతో మృతి చెందిందన్నారు. అటువంటి పరిస్థితి ఎవరికీ రాకూడదని అవయవ దానం చేసినట్లు తెలిపారు. కాలనీవాసులు వారిని అభినందించారు.

కరాటే పోటీల్లో ముగ్గురికి బంగారు పతకాలు


బంగారు పతకాలు సాధించిన యువకులు

రామాయంపేట(మెదక్): గోవాలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన మూడో ఏషియన్ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో రామాయంపేటకు చెందిన ముగ్గురు యువకులు ప్రతిభ చూపారు. బ్లాక్‌బెల్ట్ విభాగంలో రామకృష్ణ, సంపత్‌కుమార్, గ్రీన్‌బెల్ట్ విభాగంలో మహాస్విన్ బంగారు పతకాలు సాధించారు. వీరిని మాస్టర్స్ రొయ్యల హరిప్రసాద్, నగేశ్, తదితరులు అభినందించారు.

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు

- దంపతులకు తీవ్ర గాయాలు
- చికిత్స కోసం ఆస్పత్రికి తరలింపు


క్షతగాత్రులను 108లో తరలిస్తున్న దృశ్యం

పటాన్‌చెరుటౌన్: కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన పటాన్‌చెరు మండలం రుద్రారం జాతీయ రహదారిపై జరిగింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రాపురం బీహెచ్‌ఈఎల్ ఉద్యోగి ప్రభాకర్, తన భార్య విజయలక్ష్మితో కలసి కారులో 65వ జాతీయ రహదారిపై సంగారెడ్డి వెళ్తున్నాడు. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ జాతీయ రహదారిపై కారు అదుపుతప్పడంతో డివైడర్‌ను ఢీ కొంది. దీంతో వారిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కారులో స్వల్పంగా మంటలు రావడంతో స్థానికులు అప్రమత్తమై వెంటనే ఆర్పివేశారు. గాయపడిన ఇద్దరిని బయటికితీసి బీహెచ్‌ఈఎల్ జనరల్ ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. ఈ ఘటన జాతీయ రహదారిపై జరగడంతో కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి.

వినూత్న ఆలోచన.. పంటకు రక్షణ

- మైక్ సౌండ్‌తో పక్షుల బెడదకు చెక్
- పొద్దు తిరుగుడు పొలాల్లో మైక్‌సెట్ల ఏర్పాటు
- పంటలను కాపాడుకుంటున్న రైతులు


పొద్దు తిరుగుడు పొలంలో ఏర్పాటుచేసిన మైక్ సెట్


పక్షులు తొలిచిన పొద్దు తిరుగుడు

హుస్నాబాద్: ఆరుగాలం పండించిన పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. దుక్కిదున్ని, విత్తనాలు విత్తి సాగుచేసిన పంటలు చేతికి వచ్చే వరకు వాటి రక్షణ కోసం ఎన్నో ఉపాయాలు, మరెన్నో ఆలోచనలతో కాపాడుకుంటున్నారు. వన్యప్రాణులు, పక్షుల నుంచి వాటిని కాపాడుకోవడానికి రైతులు వినూత్నంగా ఆలోచనలు చేస్తున్నారు.

- అక్కన్నపేట మండలం కట్కూర్ పరిధిలోని వంకాయ తండాకు చెందిన రైతు గుగులోతు రాజు నాయక్ రెండు ఎకరాల్లో పొద్దు తిరుగుడు పంట వేశాడు.
- ప్రస్తుతం గింజ వేస్తున్న దశలో పక్షుల బెడద ఎక్కువైంది. పక్షులు గింజలను తొలుస్తూ పంటను నాశనం చేస్తున్నాయి. ఇలా పంటలపై దాడి చేస్తుండటంతో రైతులకు తీవ్రం నష్టం వాటిల్లుతోంది.
- పంటలకు చీడ పురుగులు ఆశిస్తే అందుకు తగ్గట్లుగా క్రిమిసంహారక మందును పిచికారి చేయొచ్చు. పక్షుల బెడద నుంచి పంటను ఎలా కాపాడుకోవాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. దీనికి ఏదో ఒక ఉపాయంతో పక్షుల బెడద నుంచి పంటను కాపాడు కోవాలని రాజు నాయక్ తన ఆలోచనలకు పదును పెట్టాడు.
- ఏదైన శబ్దం వినపడితే భయంతో పక్షులు పంట పొలిమేర్లకు రావని తెలిసి మైక్ సెట్ శబ్దమే విరుగుడని భావించాడు. ఆ శబ్దంతో పక్షులు పంట దరిదాపురావని నిశ్చయించుకున్నాడు. అనుకున్నదే తడవుగా రూ.2వేల ఖర్చు పెట్టి రెండు బ్యాటరీ మైక్‌సెట్లను కొనుగోలు చేశాడు.
- పంటపై పక్షులు దాడి చేయకుండా మెక్‌సెట్లకు తన వాయిస్‌తో రికార్డు చేయించి ప్రతీరోజు పొలం వద్ద పెడుతున్నాడు.
- మైక్ శబ్దానికి పొలాల్లోకి పక్షులు రావడం తగ్గించాయి. మైక్‌సెట్ లేకుంటే పక్షుల బెడద భరించలేనంతా ఉండేదని, పంటను కాపాడుకోవడం కష్టమయ్యేది. రైతు వినూత్న ఆలోచనను మెచ్చుకుంటున్నారు.

పక్షులతో నష్టం జరుగుతోంది



ప్రతీసారి పక్షుల దాడులతో పొద్దు తిరుగుడు పంటకు నష్టం జరుగుతోంది. ఏదైనా తెగులు ఆశిస్తే అందుకు రసాయనాలు పిచికారి చేస్తే నష్టాన్ని నివారించేవాళ్లం. పక్షులు గింజలను తొలగిస్తుండటంతో ఏమి చేయాలో అర్థం కాలేదు. వినూత్నంగా ఆలోచించి పొలంలో మైక్ సెట్‌ఏర్పాటు చేశారు. మెక్ సెట్ నుంచి వచ్చే శబ్దానికి పక్షులు రావడం లేదు. ఈ ప్రయోగం సక్సెస్ అయ్యింది.

– రాజు నాయక్, రైతు, వంకాయ తండా

కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్‌పై దాడి

పథకం ప్రకారమే చేశారని పోలీసులకు ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: కార్పొరేటర్‌పై పలువురు దాడిచేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పటాన్‌చెరు కార్పొరేటర్ కుమార్ యాదవ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు పట్టణంలోని శ్రీ కోదండ సీతారామస్వామి దేవస్థానంలో ఏటా జరిగే సాంస్కృతిక కార్యక్రమాలు ఈ సారి కూడా ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 7 గంటలకు హరేరామ హరేకృష్ణ బృందం సంకీర్తన కార్యక్రమం నిర్వహిస్తుండగా పట్లోళ్ల ధీరజ్, పట్లోళ్ల ఆదిత్య రామాలయానికి వచ్చి సంకీర్తల కార్యక్రమం ఎవరు నిర్వహించమన్నారంటూ మైకులు, స్క్రీన్ వైరింగ్‌ను తొలగించారు. దీంతో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ కలుగజేసుకొని సాంస్కృతిక కార్యక్రమాలను ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించడంతో అతడిని అసభ్య పదజాలంతో దూషించారు. పక్కనే ఉన్న గ్రామపెద్దలు కలగజేసుకోవడంతో వారు వెళ్లిపోయారు. తిరిగి ఉదయం 8.30 గంటల సమయంలో పట్లోళ్ల అమర్ సేన్ రెడ్డి, ధీరజ్, ఆదిత్య, మనోహర్ రెడ్డి రామాలయానికి వచ్చి నువ్వు ఎవడివిరా ఇక్కడ పెత్తనం చెలాయించేది అంటూ బూతులు తిడుతూ దాడి చేశారు. తనపై కుట్రపూరితంగా పకడ్బందీగా పథకం ప్రకారం దాడి చేశారని, గ్రామపెద్దలు అడ్డురావడంతో తనను తాను కాపాడుకోగలిగానని కార్పొరేటర్ తెలిపారు. తనపై దాడి చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సమాచారం తెలుసుకున్న పటాన్‌చెరు నియోజకవర్గ నాయకులు, యాదవ్ సంఘం జిల్లా, నియోజకవర్గ బీసీ నాయకులు కార్పొరేటర్ ఇంటికి వచ్చి జరిగిన ఘటన వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం.

నిర్మాణంలో ఉన్న దాబా కూల్చివేత


పొన్నాల వద్ద నిర్మాణంలో ఉన్న దాబాను కూల్చివేసిన దృశ్యం

సిద్దిపేట అర్బన్: నిర్మాణంలో ఉన్న దాబాను గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. ఈ ఘటన సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల మదిర గాంధీ నగర్ సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. గురువారం బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పొన్నాలకు చెందిన తుపాకుల రమణ కాంత్, బైరి రాజు, బైరి గోపాల్ కలిసి దాబా ఏర్పాటుకు నిర్ణయించుకున్నారు. బైరి రాజు, బైరి గోపాల్‌కు చెందిన సర్వేనంబర్ 282 స్థలంలో సుమారు రూ.85 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టారు. ఈ స్థలం గురించి కరీంనగర్‌కు చెందిన జానీ, అంజిరెడ్డి, కొండపాక మండలం జప్తి నాచారం గ్రామానికి చెందిన రామస్వామితో బైరి రాజు, రమాకాంత్ గొడవ పడ్డారు. దీంతో కోర్టులో పిటిషన్ వేశారు. కోర్టులో కేసు నడుస్తుండగానే ఫిబ్రవరి 23వ తేదీన దాబా వెనుక కొత్త భాగాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ విషయంపై త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితులు తెలిపారు. ఇదే అదనుగా భావించి మళ్లీ దాబాను ధ్వంసం చేశారని, గతంలో గొడవకు దిగిన ఆ ముగ్గురు వ్యక్తులే ధ్వంసం చేసి ఉంటారని బాధితులు ఆరోపిస్తున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


వార్షికోత్సవంలో విద్యార్థులతో అధికారులు

- విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి
- అడిషనల్ డీజీపీ మహేందర్

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమై విద్య లభిస్తుందని, విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని అడిషనల్ డీసీపీ (అడ్మిన్) మహేందర్ అన్నారు. మండలంలోని రసులాబాద్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం రాత్రి పాఠశాల ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. సరస్వతి దేవికి పూజలు చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవం జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థితిలో ఉన్నారని తెలిపారు. విద్యార్థుల ప్రతిభ చూస్తే మళ్లీ ప్రభుత్వ పాఠశాలకు పూర్వవైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ప్రధానోపాధ్యాయుడు హరీశ్‌ను అభినందించారు. పాఠశాల అభివృద్ధికి పాటుపడుతున్న సర్పంచ్ స్వామిగౌడ్‌ను సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ తలారి కీర్తన కిషన్, జెడ్పీటీసీ సిద్దప్ప, వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ ఎర్రోళ్ల సుదర్శన్, వైస్‌చైర్మన్ మెరుగు భాగ్య, ఉపసర్పంచ్ అన్నబోయిన సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

రామకోటి పుస్తకాల పంపిణీ

సదాశివపేట(సంగారెడ్డి): శ్రీరామ నవమి సందర్భంగా జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ నాయకుడు పులిమామిడి రాజు భక్తులకు రామకోటి పుస్తకాలను అందజేశారు. ఒక్కో పుస్తకంలో ఐదువేల సార్లు రామనామాన్ని రాసే విధంగా తయారు చేయించామని తెలిపారు.


రామకోటి పుస్తకాలను పంపిణీ చేస్తున్న పులిమామిడి రాజు

చెరువులోపడి వృద్ధుడి మృతి


నీటిపై తేలిన చంద్రయ్య మృతదేహం

తూప్రాన్: ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడు మృతిచెందాడు. ఈ సంఘటన తూప్రాన్‌లో చోటుచేసుకుంది. గురువారం ఎస్‌ఐ సురేశ్‌కుమార్, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా హౌసింగ్ బోర్డ్ కాలనీ, ప్రశాంత్‌నగర్‌కు చెందిన పర్వతం చంద్రయ్య (62) ఈనెల 26వ తేదీన తూప్రాన్‌లో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చాడు. కాగా గురువారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకుని చెరువులోకి దిగగా ప్రమాదవశాత్తు నీటమునిగి మృతిచెంది ఉంటాడని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. గతంలో రెండు మూడు సార్లు ఫిట్స్ వచ్చాయని తెలిపారు. ఈ మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

కుక్కకాట్లతో ఆందోళన


కుక్కకాటు బాధితులు

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మన్సూర్‌పూర్‌లో నెలరోజులుగా వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. బుధవారం ఒక్కరోజే ఆరుగురు కుక్కకాటుకు గురయ్యారు. నెలరోజుల వ్యవధిలో దాదాపు 20 మంది కుక్క కాటుకుగురయ్యారు. గుంపులు గుంపులుగా రోడ్లపై సంచరిస్తూ రాకపోకలు సాగించేవారిపై దాడి చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే కర్రలు పట్టుకుని వెళ్తున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మున్సిపల్ అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లినా స్పందన లేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి కుక్కలబారి నుంచి కాపాడటంతోపాటు వైద్య సహాయం అందించాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి


భూంరెడ్డి మృతదేహం

గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సమీపంలో లింగరాజ్‌పేట్ వద్ద గురువారం జరిగింది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనాజీపూర్‌కు చెందిన అన్నారెడ్డి భూంరెడ్డి(43), సింగాటంకు చెందిన గున్నాల తిరుపతిరెడ్డి వర్గల్ మండలం గౌరారం సమీపంలో గల మార్స్ ఇండియా కంపెనీలో కార్మికులుగా పని చేస్తున్నారు. రోజు మాదిరిగానే ద్విచక్ర వాహనంపై గురువారం బయలుదేరారు. ఈ క్రమంలో గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగరాజ్‌పేట సమీపంలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో డ్రైవింగ్ చేస్తున్న తిరుపతిరెడ్డి రోడ్డు పక్కకు, వెనుక కూర్చున్న భూంరెడ్డి రోడ్డుపై పడిపోయారు. దీంతో వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ భూంరెడ్డిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భూంరెడ్డికి భార్య, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భూంరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నిద్రిస్తున్న కార్మికుడి తలపై నుంచి..

చిన్నశంకరంపేట(మెదక్): పరిశ్రమలో పని ముగించుకుని లెబర్ రూం పక్కనఉన్న ఖాళీ స్థలంలో నిద్రిస్తున్న కార్మికుడి తలపై నుంచి ట్రావెల్ బస్సు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి జరిగింది. చిన్నశంకరంపేట ఎస్‌ఐ సుభాశ్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నశంకరంపేటలోని రాధాస్టీల్ పరిశ్రమలో బీహార్ రాష్ట్రం చందరన్ జిల్లా అరవ్‌తయ గ్రామానికి చెందిన అమూద్‌కుమార్(40) కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజువారిలాగే పరిశ్రమలో పనులు ముగించుకుని రూమ్‌కు వచ్చాడు. గదిలో వేడిగా ఉందని పక్కన ఉన్న పరిశ్రమ ఖాళీ స్థలంలో నిద్రించాడు. కార్మికులను తీసుకువచ్చిన ట్రావెల్ బస్సు వెనక్కి మళ్లిస్తున్న క్రమంలో కార్మికుడి తలపై నుంచి వెళ్లాడు. దీంతో కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తోటి కార్మికుడు చందన్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న పెట్రోల్ ట్యాంకర్

- యువకుడికి తీవ్ర గాయాలు
- పరిస్థితి విషమం


తీవ్రంగా గాయపడిన రవి

పాపన్నపేట(మెదక్): పెట్రోల్ ట్యాంకర్, బైక్ ఢీకొనడంతో ఓ యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పాపన్నపేట శివారులోని దారి దేవుని ఆలయం వద్ద గురువారం రాత్రి జరిగింది. పాపన్నపేట ఎస్‌ఐ విజయ్ నారాయణ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. టేక్మాల్ మండల పరిధిలోని ఎల్లుపేట తండాకు చెందిన ముడావత్ రవి నార్సింగి వైపు బైక్‌పై వెళ్తుండగా పెట్రోల్ ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో రవికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని మెదక్‌లోని ఆస్పత్రికి తరలించారు. కాగా అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు.

ఇద్దరి అదృశ్యం


మొయినొద్దీన్ (ఫైల్)

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతు మొరంగపల్లి మొయినొద్దీన్(48) కనిపించకుండాపోయినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వారం క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసినవారిని, బంధువులను విచారించినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 87126 56721, 99661 62414 సెల్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

ఇంటిలో చెప్పకుండా వెళ్లి..

చేగుంట(తూప్రాన్): మండలంలోని అనంతసాగర్ గ్రామస్తుడు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. గురువారం వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిక్కుడు నరేశ్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తరచూ నరేశ్ తండ్రి ఆంజనేయులుతో కుటుంబ విషయాల్లో గొడవపడుతుండేవాడు. నరేశ్ భార్య సింధూజ ఈనెల 26వ తేదీన బంధువుల ఇంటికి వెళ్లగా, నరేశ్ ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న భార్య తెలిసినవారిని, బంధువులను విచారించినా నరేశ్ ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు.


నరేశ్ (ఫైల్)

శభాష్ మహేందర్

సీపీఆర్‌తో నిలిచిన ప్రాణం


ప్రాణాపాయం నుంచి బయటపడ్డ పర్వతం రాజు

కొండపాక(గజ్వేల్): ఆటో డ్రైవర్ పర్వతం రాజు(28)కు 108 అంబులెన్స్ సిబ్బంది సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడారు. అంబులెన్స్ సిబ్బంది బైండ్ల మహేందర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కుకునూరుపల్లి మండలం చిన్నకిష్టాపూర్ గ్రామానికి చెందిన పర్వతం రాజు ట్రాలీ ఆటోను నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం సుమారు 6.30 గంటల సమయంలో ట్రాలీ ఆటోలో చిన్న కిష్టాపూర్ నుంచి కుకునూరుపల్లికి వెళ్తున్నాడు. మార్గం మధ్యలో బొబ్బాయిపల్లి శివారులోకి రాగానే గుండెనొప్పి రావడంతో ఆటోను రోడ్డు పక్కన నిలిపి కింద పడిపోయాడు. అటుగా వెళ్తున్న కరణ్‌రెడ్డి వెంటనే 108 అంబులెన్సుకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. గుండెనొప్పి రావడంతో అపస్మారక స్థితికి వెళ్లాడన్న విషయాన్ని గుర్తించిన సిబ్బంది మహేందర్ సీపీఆర్ చేయడంతో స్పృహలోకి వచ్చాడు. వెంటనే ఈవిషయాన్ని అంబులెన్సు కాల్ సెంటర్ వైద్యుడు మహీత్ దృష్టికి తీసుకెళ్లి అతడి సూచనలు, సలహాల మేరకు చికిత్స అందిస్తూ రాజును అంబులెన్సులో గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రాజు గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రాణాపాయం లేదని వైద్యులు ధ్రువీకరించారని మహేందర్ తెలిపాడు. అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చిన కరణ్‌రెడ్డికి, అంబులెన్సు సిబ్బంది మహేందర్, రమేశ్‌ను రాజు కుటుంబీకులు, బంధువులు, ఆస్పత్రి వైద్యులు అభినందించారు.


అంబులెన్స్‌లో రాజుకు సీపీఆర్ చేస్తున్న సిబ్బంది బైండ్ల మహేందర్

ఇర్కోడ్‌కు రాష్ట్రస్థాయి అవార్డు

- మహిళల సాధికారితలో ఉత్తమ ప్రతిభ
- ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయత్ అవార్డు ప్రకటన

గ్రామ వివరాలు	
మొత్తం ఇళ్లు:	650
ఓటర్లు:	1800
జనాభా:	2410
ఉన్నత పాఠశాల:	1
ప్రాథమిక పాఠశాల:	1
అంగన్‌వాడీ కేంద్రాలు:	2



ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయత్ ప్లకార్డుతో మహిళలు


ఇర్కోడ్ గ్రామ పంచాయతీ కార్యాలయం

సిద్దిపేటరూరల్: స్వచ్ఛతా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తూ, మహిళలను అన్ని సభలు, సమావేశాల్లో భాగస్వామ్యం చేస్తూ ముందుకు సాగుతున్నందుకుగాను 2021–22 సంవత్సరానికిగాను ఇర్కోడ్ గ్రామానికి రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మరోసారి పురస్కారంతో సత్కరించనుంది. ఈ మేరకు బుధవారం ఇర్కోడ్ గ్రామానికి ఉమెన్ ఫ్రెండ్లీ గ్రామ పంచాయత్ అవార్డును ప్రకటించింది. ఈనెల 31వ తేదీన హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేయనున్నారు.

స్వచ్ఛతా కార్యక్రమాల్లో భాగస్వామ్యం

గ్రామంలో నిర్వహిస్తున్న స్వచ్ఛతా కార్యక్రమాల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న అన్ని పథకాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకున్నారు. అదే విధంగా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తూ వారు సాధికారితను సాధించడంతో అవార్డు పొందగలిగారు. గ్రామంలోని మహిళలకు ఇర్కోడ్ చట్ని పేరిట గుర్తింపు పొందేలా ఉపాధిని కల్పించారు. అంగన్‌వాడీలు, హెల్త్ సబ్‌సెంటర్ల ద్వారా మహిళలకు వైద్యసేవలందుతున్నాయి. గ్రామంలో నిర్వహిస్తున్న అభివృద్ధి, అవగాహన సదస్సుల్లో మహిళలను భాగస్వామ్యం చేయడం వంటి అంశాలు అవార్డు పొందేందుకు దోహదపడ్డాయి.

చాలా సంతోషంగా ఉంది



గ్రామానికి అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. రాష్ట్ర, ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో గ్రామంలో స్వచ్ఛత, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాం. మంత్రి సహకారం, గ్రామస్తుల భాగస్వామ్యంతో అవార్డు పొందగలిగాం. గ్రామాన్ని మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుంటాం.

– వినీత రవీందర్‌రెడ్డి, సర్పంచ్, ఇర్కోడ్